# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- తుఫాను కారణంగా ప్రాణనష్టం సంభవించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

- మొంథా తుఫాను నేపథ్యంలో రాష్ట్రానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు.

- కోస్తా జిల్లాల్లో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది.

- ప్రకృతి విపత్తును సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు కాకినాడ జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు.

===================

మొంథా తుఫాను కారణంగా ఎవరూ ప్రమాదాల బారిన పడకూడదని, ఏ ఒక్క మరణం సంభవించకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు. తుఫాను ప్రభావాన్ని, నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరేలా రియల్ టైమ్‌లో సమాచారం అందించాలని ఆదేశించారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో మొంథా తుఫాను వల్ల నెలకొన్న పరిస్థితులు, చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులతో ముఖ్యమంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తుపానుకు సంబంధించిన సమాచారాన్ని ప్రతీ గంటకూ విడుదల చేస్తూ.. ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే 2,707 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమాచార వ్యవస్థకు అవాంతరాలు లేకుండా చూడాలని పేర్కొన్నారు.

===================

రాష్ట్రంలో మొంథా తుఫాను నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడుకు ఈ రోజు ఫోన్ చేసి ప్రస్తుత పరిస్థితులతో పాటు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రధానికి ముఖ్యమంత్రి వివరించారు. తుఫాను పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి కూడా తెలియజేసారు. ప్రకృతి విపత్తు వేళ కేంద్రప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ప్రధానమంత్రి భరోసా ఇచ్చినట్లుగా చంద్రబాబు నాయుడు తెలిపారు.

==================

మచిలీపట్నం, కాకినాడ మధ్య ప్రాంతంలో రేపు రాత్రి మొంథా తుఫాను తీరాన్ని దాటే అవకాశం ఉందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ వెల్లడించారు. అమలాపురం కలెక్టరేట్ లో పాత్రికేయులతో ఆయన ఈ రోజు మాట్లాడుతూ.. తుఫాను తీరాన్ని దాటే సందర్భంలో ఈదురుగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని చెప్పారు. సముద్ర తీర ప్రాంతం వెంబడి 120 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. సముద్ర తీరానికి 30 కిలోమీటర్ల పరిధిలో ముంపు ప్రభావం ఉన్న ప్రాంతాలను గుర్తించి అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కొత్తపేట, రామచంద్రపురం డివిజన్లలో కూడా పునరావాస కేంద్రాలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ వివరించారు.

==================

మొంథా తుపానును ఎదుర్కొనేందుకు కాకినాడ జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పి. నారాయణ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లో అధికారులతో కలిసి మంత్రి తుపాను పరిస్థితిపై ఈ రోజు సమీక్షించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. జిల్లాలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు. తుపాను కారణంగా పాఠశాలల భవనాలు, కమ్యూనిటీ హాల్స్, ప్రభుత్వ వసతి గృహ భవనాలను తాత్కాలిక పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేశామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

==================

రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ శ్రీవాస్తవ, తూర్పు, దక్షిణ కోస్తా రైల్వే అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రస్తుతం రాష్ట్రంలో పురోగతిలో ఉన్న 33,630 కోట్ల రూపాయల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని కోరారు. అదే విధంగా రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి తక్షణం చేపట్టాల్సిన చర్యల గురించి రైల్వే శాఖ దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇదిలా ఉండగా నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు- గుంతకల్, గుణదల - ముస్తాబాద్ బైపాస్, రాయదుర్గ్-తుముకూరుల మధ్య రైల్వేలైన్ ప్రాజెక్టుల పురోగతిపై ఈ సమీక్షలో చర్చించారు. రాష్ట్రంలో కొత్త రైల్వేలైన్లు, అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి, రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణాలకు సంబంధించి రైల్వేశాఖకు రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనలు, వాటి పురోగతి గురించి కూడా చర్చించారు.

విరామం

==================

విశాఖపట్నంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (CBC) క్షేత్ర కార్యాలయం, ఆకాశవాణి కేంద్రాలను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ అనుజ్ దీక్షిత్ ఈరోజు సందర్శించారు. దేశవ్యాప్తంగా అమలులో ఉన్న స్వచ్ఛతా ప్రత్యేక ప్రచారం 5.0 కింద ఆయా కేంద్రాల్లోని కీలక కార్యకలాపాల అమలును ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. స్వచ్ఛోత్సవ్ కార్యక్రమ ఉద్దేశ్యం కేవలం పరిసరాలను శుభ్రపరచడం మాత్రమే కాదని బాధ్యతాయుతమైన పౌరసత్వం పట్ల

ప్రవర్తనా మార్పును కల్పించడమన్నారు. అంతకుముందు CBC డైరెక్టర్ పి. రత్నాకర్, క్షేత్ర కార్యాలయ అధికారి కె. శ్రీరామమూర్తి స్వచ్ఛతా ప్రత్యేక ప్రచారం 5.0 లో భాగంగా కార్యాలయంలో వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రతకు ఇస్తున్న ప్రాధాన్యం మొదలగు అంశాలపై అనుజ్ దీక్షిత్ కు వివరించారు.

==================

మొంథా తుఫాను ప్రభావంతో కోస్తా జిల్లాలలో రానున్న మూడు రోజులలో భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. విశాఖలో ఈ రోజు హెచ్చరికల కేంద్రం అధికారి జగన్నాథ్ కుమార్ పాత్రికేయులతో మాట్లాడుతూ... తుఫాను నేపథ్యంలో ఉత్తర కోస్తా జిల్లాలలో తీవ్రమైన గాలులతో పాటు భారీ వర్షాలు అనేక చోట్ల కురిసే అవకాశం ఉందని చెప్పారు. మరిన్ని వివరాలను ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

==================

నైరుతి - ఆగ్నేయ బంగాళాఖాతాలను ఆనుకుని మొంథా తుఫాను వేగంగా కదులుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో అత్యంత భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. మొంథా తుఫాను నేపథ్యంలో తీరం వెంబడి బలమైన గాలులు వీచే అవకాశాలు ఉంటాయని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళకూడదని స్పష్టం చేసింది. అన్ని పోర్టుల్లో ఒకటో నెంబర్ హెచ్చరిక కొనసాగుతోందని పేర్కొంది. అలాగే రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎరుపు, నారింజ, పసుపు రంగులతో కూడిన హెచ్చరికలను జారీ చేసింది.

==================

రాష్ట్రంలోని అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ గడువును మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను ఈ రోజు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ విడుదల చేసిన ఉత్తర్వులలో 2026 జనవరి 23వ తేదీ వరకూ లే అవుట్లు, ప్లాట్ ల క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం కల్పించారు. వాస్తవంగా ఈ నెల 23తో గడువు ముగిసినా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులతో గడువుని పొడిగించారు.

==================

మొంథా తుఫాను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉందని రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. తుఫాను పరిస్థితుల గురించి మంత్రి అధికారులతో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో అనేక జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, 100 నుండి 120 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

==================
==================